సాక్షి తిరుపతి

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025

పచ్చటి బంధం.. తెల్లటి అందం



ప్రకృతిలో ఓ ఆకృతి విరుస్తోంది.. నింగీ నేలా ఒక్కటవుతోంది.. కారు మబ్బులు కొండలను చుట్టేశాయి.. పచ్చటి బంధంతో తెల్లటి అందం మమేకమవుతోంది. ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తోంది. ఈ సుందర దృశ్యాలు తిరుమల రెండో ఘాట్ రోడ్‌లో గురువారం కనిపించాయి. ఘాట్‌లో వెళ్లే భక్తులను కొండలను తాకే మబ్బులు కట్టిపడేశాయి. తన్మయత్వంతో తేలిపోయేలా చేశాయి. – ఫొటో :–మోహన్ కృష్ణ కేతారి, సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

న్యూస్‌రీల్

ముగిసిన డిగ్రీ అడ్మిషన్లు

- వచ్చే వారంలో స్పాట్ ప్రవేశాలకు అవకాశం

తిరుపతి సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ డిగ్రీ కళాశాలల్లో గురువారంతో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. దీంతో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో కేవలం 25శాతం ప్రవేశాలు మాత్రమే జరగడం విచారకరం. అలాగే తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతీ డిగ్రీ కళాశాలల్లో మాత్రం 85 శాతం సీట్లు భర్తీ కాగా, ఎస్వీ ఆర్ట్స్, ఎస్‌జీఎస్ కళాశాలల్లో కేవలం 55 శాతం అడ్మిషన్లు జరిగాయి. జిల్లాలోని అన్ని ప్రైవేటు కళాశాలల్లో కేవలం 45శాతం అడ్మిషన్లు మాత్రమే జరిగినట్లు యాజమాన్యాలు ఆవేదన వక్తం చేస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఆలస్యంగా అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడమేనని మండిపడుతున్నారు. కాగా టీటీడీ డిగ్రీ కళాశాలల్లో మిగిలిన సీట్లకు వచ్చే వారం చివరి నుంచి స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయంలో ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 20న దీపావళి ఆస్థానం సందర్భంగా గురువారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రిని నీటితో శుద్ధి చేసిన తర్వాత నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసు పు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన మిశ్రమాన్ని ఆలయం అంతటా లేపనం చేశారు. ఆలయ డిప్యూటీ ఈఓ వీఆర్.శాంతి, ఏఈఓ ఏబీ.నారాయణ చౌదరి పాల్గొన్నారు.

ఎస్వీయూ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం



విజయభాస్కర్‌రావు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావుకు అరుదైన అవకాశం లభించింది. ఇప్పటికే ఆయన ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. కాగా ప్రభుత్వం అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా అదనపు బాధ్యలను అప్పగించారు. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఎస్వీయూలో ఇలాంటి పదవులు చేపట్టిన వ్యక్తిగా ఆయన రికార్డు సృష్టించారు. ఆయన్ని అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ భక్తులతో నిండిపోయాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 79,919 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,218 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.79 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారు స్వామివారిని దర్శించుకోవడానికి 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించబోరని స్పష్టం చేసింది.

మాయం.. ఖనిజం

‘దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి’ అన్న చందంగా అధికారంలో ఉండగానే అడ్డగోలుగా సంపాదించేందుకు కూటమి పెద్దలు రకరకాల స్కెచ్‌లు వేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ గనుల శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన రాయల్టీ బాధ్యతను ‘ప్రైవేటు’పరం చేశారు. గూడూరు నియోజకవర్గం కోట, చిల్లకూరు, చిట్టమూరు, వాకాడు పరిధిలో సిలికా, గ్రావెల్, బ్లూమెటల్, ఇసుక తదితర ఖనిజ సంపద పుష్కలంగా దొరుకుతాయి. దీనిపై కన్నేసిన కూటమి పెద్దలు ప్రైవేటు సైన్యాన్ని రంగంలోకి దింపారు.



చిల్లకూరు మండలం నల్లాయగారిపాళెం వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రం

అనధికారిక చెక్ పోస్టులు

ప్రైవేటు సైన్యం కళ్లు గప్పి ఒక్క టన్ను కూడా బయటకు వెళ్లకుండా గూడూరు నియోజకవర్గ పరిధిలోని గొల్లపల్లి, తిప్పవరప్పాడు, చిల్లకూరు మండలంలోని నల్లయగారిపాళెం, చేడిమాల, అంకులపాటూరు, చింతవరం, వరగలి, కోట క్రాస్ రోడ్డు, బూదనం రోడ్డు, కోట మండలం గూడలి, మెట్టు, కర్లపూడి, కేసవరం, రాఘవాపురం, కోట క్రాస్ రోడ్డు, వాకాడు మండలంలో బాలిరెడ్డిపాళెం, వాకాడు బ్యారేజ్, చిట్టమూరు మండలంలో మెట్టు, చిట్టమూరులో అనధికారిక చెక్ పోస్టులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రైవేటు ఏజెన్సీ ద్వారా పొందిన రాయల్టీ రసీదు చూపిస్తే వాహనాలకు అనుమతి ఉంటుంది. లేదంటే ఫైన్, కేసులు ఇతరత్రా వేధింపులు తప్పవు.

చిల్లకూరులో గనుల శాఖ కార్యాలయం

గనులకు సంబంధించి అధికారిక కార్యాలయాలు, చెక్‌పోస్టులు ఉంటాయి. ప్రైవేటు ఏజెన్సీల పుణ్యమాని వారే చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. గూడూరు... నెల్లూరు జిల్లాలో ఉన్న సమయంలో గనుల శాఖ కార్యాలయం పూర్తిగా నెల్లూరులో ఉండేది. జిల్లాల మార్పుతో గూడూరు నియోజకవర్గంలో ఎక్కువగా మైనర్, మేజర్ మినరల్ దొరుకుతుండడంతో చిల్లకూరులో గనుల శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మైనర్ మినరల్ రాయల్టీ వసూళ్లను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడంతో వారు చిల్లకూరులో అనధికారికంగా గనుల శాఖ కార్యాలయం ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇకపై ఎవరైనా సిలికా, ఇసుక, గ్రావెల్, నల్ల, బ్లూ కంకరను తరలించాలంటే ఇక్కడ రాయిల్టీ చెల్లించి అనుమతులు తీసుకున్న తరువాతనే తరలించాల్సి ఉంటుంది.

రాయల్టీ బాధ్యత ప్రైవేటుకు అప్పగింత

- గనుల శాఖకు ఇకపై ఎటువంటి సంబంధం ఉండదు
- రాయల్టీ వసూళ్ల కోసం గూడూరులో అనధికార చెక్‌పోస్టులు
- ప్రైవేటు సైన్యం గుప్పెట్లో సిలికా, గ్రావెల్, ఇసుక తదితర ఖనిజ సంపద

సాక్షి టాస్క్‌ఫోర్సు: అక్రమాలను అరికట్టేందుకు రాయల్టీ వసూళ్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించామని సాకు చెబుతూ దొడ్డి దారిలో రూ.కోట్లు కొల్లగొట్టేందుకు కూటమి నేతలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ సంపదంతా ఎక్కువ శాతం ప్రభుత్వ భూముల్లో ఉండడంతో చిన్నపాటి అనుమతి తీసుకుంటే చాలు. ఆ అనుమతులను చూపి, పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో తవ్వకాలు జరిపి, రూ.కోట్లు కొట్టేయవచ్చు. ఇందులో భాగంగా ఏడాది కాలంగా కూటమి బ్యాచ్ గూడూరులో తిష్ట వేసి ఖనిజ సంపద గురించి అన్వేషించింది. అయితే తెల్లరాయి, సిలికా తరలింపులు వివాదాస్పదంగా మారడంతో దీనిపై కూటమి ప్రభుత్వం తమకు అనుకూలంగా ఎవరైతే ఉంటారో వారికే సిలికా, ఇసుక, గ్రావెల్ (మైనర్ మినరల్) తరలించేలా అనుమతిచ్చింది.

గనుల శాఖ నిర్వీర్యం!

ప్రభుత్వం ఎప్పటికప్పుడు గనుల శాఖ ఆధ్వర్యంలో మైనర్ మినరల్ తవ్వకాలు, తరలింపులకు సంబంధించి అన్ని అనుమతులు ఇచ్చేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గనుల శాఖను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా రాయల్టీ వసూళ్లకు అనుమతులను ఇచ్చింది. రెండేళ్లలో ప్రభుత్వానికి రూ.340 కోట్లు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఇక దొరికిందే తడవు నిబంధనలకు విరుద్ధంగా ఆ ఏజెన్సీ అంతకు రెండింతలు వసూలు చేయడం మొదలు పెట్టింది. అనుచరుల ద్వారా ప్రభుత్వ భూముల్లో అక్రమంగా తవ్వకాలు జరిపి తరలించేలా పక్కా ప్రణాళికలు రూపొందించుకున్నారు. సాధారణంగా సిలికా టన్ను రూ.307 వసూలు చేసేవారు. ఇదే టన్ను సిలికా బయటి మార్కెట్‌లో రూ.3 వేలకు పైనే ఉంటుంది. మిగిలిన గ్రావెల్, ఇసుక, బ్లూమెటల్ పరిస్థితి కూడా దాదాపు అంతే. బయటి మార్కెట్‌ని దృష్టిలో ఉంచుకుని ఒక రాయల్టీ రసీదును చూపించి ఖనిజాన్ని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకోవడం ప్రారంభించారు.



చిల్లకూరు మండలం కోట క్రాస్ రోడ్డు ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు



తనిఖీ కేంద్రం వద్ద ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు

ఏజెన్సీలే చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి

“ మైనర్ మినరల్ తవ్వకాలు, తరలింపులకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం ఏఎంఆర్ అనే ఏజెన్సీతో ప్రతి టన్నుకు రాయిల్టీ చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. దీంతో ఏజెన్సీకి చెందిన వారు పలు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసుకుని తనిఖీలు చేస్తూ అనుమతులు ఉన్న వాహనాలను మాత్రమే పంపేలా చేస్తున్నారు. ఇది మొత్తంగా ప్రైవేట్ ఏజెన్సీకి చెందిన విషయం.

– శ్రీనివాసరావు, ఏడీ, గనులశాఖ

ఆరుగురు రెవెన్యూ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

సత్యవేడు: మండలంలోని వానెల్లూరు ఫారెస్టు భూములకు సంబంధించి వెబ్‌ల్యాండ్ అక్రమనయోదులో స్థానిక రెవెన్యూ అధికారులు ఆరుగురిపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్ సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన వారిలో ఇన్‌చార్జి ఆర్‌ఐ సురేష్, వానెల్లూరు వీఆర్వో రాఘవేంద్ర, గ్రామ సర్వేయర్ వెంకటేశ్, కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, వీఆర్వో భార్గవ్, పూర్ణచంద్ర నాయుడు ఉన్నట్లు తహసీల్దార్ రాజశేఖర్ తెలిపారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దారు రామాంజనేయులు కూడా సస్పెన్షన్‌కు గురైనట్లు సమాచారం. వానెల్లూరు గ్రామంలో 197/1లో 252.16 ఎకరాల ఫారెస్టు భూములకు సంబంధించి వెబ్‌ల్యాండ్ భూ మాయాజాలంపై సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో వీరిపై కేసులు నమోదు అయిన విషయం విదితమే.

శాస్త్రోక్తం..అంకురార్పణం



పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలకు గురువారం అంకురార్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన చేశారు. ఉదయం ఆచార్య రిత్వికరణం నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు మత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం జరిపారు. అనంతరం అంకురార్పణ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ డిప్యూటీ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాల్లో నేడు

పవిత్రోత్సవాల్లో భాగంగా మొదటిరోజైన శుక్రవారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 5 నుంచి 6 గంటలకు గ్రామోత్సవం, 7 నుంచి 8.30 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలను నిర్వహించి, పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

భూ చోళ్లు

ప్రభుత్వాలు అడవుల పెంపకానికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నాయి. అయితే కూటమి నేతలు ఉన్న అడవులు నరికివేసి, కొండలను చదును చేసి, మామిడి తోటల పెంపకం పేరుతో కబ్జా చేస్తున్నారు. కొంత కాలం తరువాత గుట్టు చప్పుడు కాకుండా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన అటవీ, రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ.. కూటమి నేతలకు వంతపాడుతున్నారు. ఫలితంగా పచ్చదనం కరిగిపోతోంది.



కొండను చదును చేస్తూ, వాహనాల్లో మట్టిని లోడ్ చేస్తున్న హిటాచీ

- అటవీ భూమి యథేచ్ఛగా ఆక్రమణ
- రూ.కోట్లు కొల్లగొడుతున్న కూటమి నేతలు

రామచంద్రాపురం: రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వస్తే అటవీభూములు కనుమరుగైపోతాయి. 2014–19 నాటి ఆక్రమణలు ఏడాదిన్నర కాలంగా మళ్లీ ఊపందుకున్నాయి. కూటమి నేతలు ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడంటూ పెట్రేగిపోతున్నారు. అధికారం ఉంది.. అవకాశం ఉన్న మేర అటవీ భూములను ఆక్రమించేద్దాం.. దొంగ పట్టాలు సృష్టించుకుని ఇనుప కంచెలతో హద్దులు ఏర్పాటు చేసుకుని, కేంద్ర పథకం ఎన్‌ఆర్జీఎస్ నిధులతో మామిడి తోటలు పెంపకం, ఆపై రూ.కోట్లకు ఎన్నారైలకు భూములను విక్రయించేస్తున్నారు. అనుపల్లి, సి.రామాపురం, గుండోడు కనం, చిట్టత్తూరు, రాయలచెరువు, పిల్లారి కొండలు కబ్జా కోరల్లో చిక్కి భావితరాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని మండల ప్రజలు లబోదిబోమంటున్నారు. ప్రజల ఆస్తులను ప్రకృతి సంపద కాపాడాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు విధులను విస్మరించి, పాలకుల చేతిలో కీలుబొమ్మలుగా వ్యవహరిస్తున్నారంటూ స్థానిక ప్రజలు వాపోతున్నారు.

రెవెన్యూ వ్యవస్థపై మండిపాటు

మండలంలో రెవెన్యూ వ్యవస్థ పనితీరుపై ప్రజలు మండిపడుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అటవీ భూములు ఆక్రమణలకు అడ్డుకట్ట వేయలేక భూ బకాసురుల చేతులో బందీలుగా మారారు. అనుపల్లి సర్వే లెక్కల దాఖలాలో 411, 480లో గతంలో ఎన్నడూ లేని పట్టాలను సృష్టించుకుని అటవీ భూములను అదును చూసి చదును చేస్తున్నారు. గతంలో అటవీ భూముల ఆక్రమణలపై ప్రభుత్వ అనుకూల పత్రికలో ప్రచురితమైన కథనాల మేరకు అప్పటి జిల్లా అధికారులు స్పందించి బోగస్ పట్టాలను రద్దు చేసి, ఆక్రమణలను అడ్డుకున్నారు. మండల కేంద్రానికి 15 మైళ్ల దూరంలో అనుపల్లి అటవీ భూములున్నాయి. భారీ యంత్రాలతో రేయింబవళ్లు చదును చేస్తున్నారని, జిల్లా అధికారులకు సమాచారం తెలిసి వారువచ్చే సమయానికి మండల అధికారులు కూటమి నేతలకు సమాచారం చేరవేయడంతో ఆక్రమణదారులు అప్రమత్తమై యంత్రాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి రాత్రి సమయంలో పనులను సజావుగా సాగిస్తున్నారని అనుపల్లి, కూనేపల్లి ప్రజలు మండిపడుతున్నారు.

విద్యుత్ శాఖ సహకారం

రైతులు, సామాన్య ప్రజలకు విద్యుత్ కనెక్షన్లు కావాలంటే నెలలు తరబడి కార్యాలయల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, అధికారుల చేయి తడపనిదే సామాన్యుల పనులు ముందుకు సాగవు. అయితే అటవీ భూముల అక్రమణదారులకు, కూటమినేతల నివాసాల వద్ద అధికారులే పడిగాపులు కాసి, ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్న సందర్భాలను చూసి ప్రజలు విస్మయానికి గురవుతున్నారు.

రెవెన్యూ మౌనమెందుకు?

రామచంద్రాపురంలో జరుగుతున్న అటవీ భూములను, ఇష్టారాజ్యంగా ఆక్రమించుకుంటూ.. ప్రజా సంపదను లూటీ చేస్తున్న రూ.కోట్ల విలువచేసే మట్టిని, భూములను కొల్లగొడుతున్న పట్టీపట్టనట్టు చోద్యం చూస్తున్న రెవెన్యూ సిబ్బందిపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చట్టాలు, శిక్షలు సామాన్యులకేనా? కూటమి నాయకులకు వర్తించవా? అంటూ బహిరంగంగానే ప్రజలు విమర్శిస్తున్నారు. సామాన్య రైతులు పట్టా భూములను ఆన్‌లైన్, పాస్ బుక్ చేసుకోవాలన్న ఏళ్ల తరబడి తహసీల్దార్ కార్యాలయాలు చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా తమ ఫైళ్ల ముందుకు కదలవని, అక్రమణ దారులకు, కూటమి నేతలకు మాత్రం అన్నీతామై కబ్జాదారుల పనులు సజావుగా సాగేలా అధికారులు విధులు నిర్వహిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.



అటవీ భూముల్లో మట్టి చదును చేస్తున్న జేసీబీ

నిరసన చేపడతాం

తమ పశువులు, జీవాలు మేతకు అటవీ భూములు ఆశ్రయంగా ఉండేవని ప్రస్తుతం కబ్జా కోరల్లో చిక్కుకొని ఇనుప కంచెలు నిర్మించేశారని, భారీ యంత్రాల శబ్దాలకు జంతువులు అడవులు విడిచి జనావాసాలకు వస్తున్నాయని, ఈ ఆక్రమణలు ఇలాగే కొనసాగితే భావితరాల భవిష్యత్తు కనుమరుగుతుందని, ఒకప్పుడు అడవులు ఉండేవని చెప్పుకొనే పరిస్థితి వస్తుందని, వర్షాలు పడక రైతులు వలసి వెళ్లిపోయే ప్రమాదం ఉందని, ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న వారిపై జిల్లాస్థాయి అధికారులు, కలెక్టర్ స్పందించి చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున అనుపల్లి కునేపల్లి ప్రజలు నిరసన చేపడతామని తెలియజేశారు.

టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

తిరుపతి సిటీ: రాష్ట్ర సాంకేతిక, విద్యాశిక్షణ మండలి టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షల నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు తిరుపతి టైప్ రైటింగ్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షార్ట్‌హ్యాండ్ పరీక్షలు వచ్చే ఏడాది జనవరి 4న, అలాగే టైప్ రైటింగ్ పరీక్షలు జనవరి 24, 25 తేదీల్లో జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరు కావాలనుకునే విద్యార్థులు తమకు సమీపంలోని టైప్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని, నవంబర్ మొదటి వారంలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.130,940
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.11,831
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.183.00



కేసులతో మీడియాను భయపెట్టలేరు



వార్తల్లో ఏవైనా అభ్యంతరం ఉంటే సరైన ఖండన ఇచ్చే అవకాశం ప్రభుత్వానికి ఉంటుంది. అలా కాకుండా కేసులు పెట్టి మీడియాను భయపెట్టాలని చూడడం సరైనది కాదు. ఇది పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమే. సాక్షి ఎడిటర్‌పై పోలీసులు వ్యవహరించిన తీరు సరైనది కాదు. పోలీసుల ద్వారా మీడియాను భయపెట్టాలని చూస్తున్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇది మంచిది కాదు. మీడియా పైన కక్ష సాధింపు చర్యలు ఇకనైనా మానుకోవాలి.

– కె. గిరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్

సాక్షి మీడియాపై కేసులు అప్రజాస్వామికం



ప్రభుత్వం గత నాలుగు రోజులుగా సాక్షి మీడియాపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. పోలీసులను ముందు పెట్టి జర్నలిస్టులను భయపెట్టాలని చూస్తున్నారు. ఇలాంటి చర్యలు మీడియా స్వేచ్ఛకు మంచిది కాదు. వార్తలపై అభ్యంతరం ఉంటే చట్టపరంగా ముందుకెళ్లాలి తప్ప ఇలా కేసులతో భయపెట్టి లొంగదీసుకోవాలని చూడడం అసాధ్యం. మీడియాను రక్షించాల్సిన వ్యవస్థలే కక్ష పూరితంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

– ఆర్.మురళి, అధ్యక్షుడు, తిరుపతి ప్రెస్ క్లబ్

మీడియాపై రాజకీయ కక్ష తగదు



మీడియాకు రాజకీయ కక్ష అప్రజాస్వామికం. ప్రభుత్వ వైఫల్యాలపై సాక్షిలో కథనాలు ప్రచురించారని పత్రిక కార్యాలయాలపై పోలీసులు దాడిచేయడమేంటి? ఎడిటర్‌ను బెదిరించడం, కార్యాలయంలో సోదాలు చేయడం దారుణం. మీడియాపై అధికారులు ఇలా దాడులకు పాల్పడితే అది ప్రజాస్వామ్యంపై దాడిగానే పరిగణించాలి. ఈ విధానాన్ని పాత్రికేయ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

– విజయ్ యాదవ్, జేశాప్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు

కక్ష సాధింపు చర్యలు ఉపసంహరించుకోవాలి



ప్రశ్నించే గళంపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గం. ఇలాంటి చర్యల కారణంగా ప్రభుత్వ ప్రతిష్ట దిగజారుతుంది. సాక్షి దినపత్రిక ఎడిటర్‌తో పాటు పలువురు రిపోర్టర్లపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. హైదరాబాదులో సాక్షి కార్యాలయంలో ఎడిటర్, జర్నలిస్టులను అన్యాయంగా విచారణ చేయడం దారుణం. పత్రికా స్వేచ్ఛకు ఇవి ప్రమాదకరమైన సంకేతాలు.

– రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, తిరుపతి

క్లుప్తంగా

టిప్పర్ ఢీకొని కార్మికుడి మృతి



శేషగిరిరావు మృతదేహం

చంద్రగిరి: టిప్పర్ ఢీకొని కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని మల్లయ్యపల్లి సమీపంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మల్లయ్యపల్లి సమీపంలోని ఓ క్వారీలో అనంతపురం జిల్లా కమలాపురానికి చెందిన శేషగిరిరావు కొన్నేళ్లుగా సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున క్వారీ యంత్రాల్లో డీజిల్ అయిపోవడంతో, క్యాన్లలో డీజిల్ నింపుకోవడానికి నడిచి వెళుతున్నాడు. ఈ క్రమంలో క్వారీ నుంచి ప్రధాన రహదారికి వస్తున్న టిప్పర్ శేషగిరిరావును ఢీకొంది. ఈ ప్రమాదంలో శేషగిరిరావు తీవ్ర గాయపడడంతో, తోటి కార్మికులు హుటాహుటిన తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలు చేసిన అధికారులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు..



చిల్లకూరు: తీర ప్రాంతంలోని తూర్పు కనుపూరు ముత్యాలమ్మ ఆలయం పరిసరాల్లో బుధవారం సుమారు 60 ఏళ్లకు పైగా వయస్సున్న ఓ వృద్ధుడు మృతి చెందినట్లు స్థానికులు గురువారం సమాచారం ఇచ్చినట్లు చిల్లకూరు పోలీసులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం మేరకు.. తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయ పరిసరాల్లో కొంత కాలంగా భిక్షాటన చేసుకుంటూ అక్కడే జీవనం చేస్తున్న ఓ వృద్ధుడు మృతి చెందాడని, వయస్సు మీరి అనారోగ్యానికి గురై మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. అతని ఎడమ చేతిపై టీ వెంకటరమణ అనే పేరు మాత్రం పచ్చబొట్టు ఉందని, మిగిలిన ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. ఎక్కడైనా మిస్సింగ్ కేసు నమోదు అయినట్లు గుర్తించే వరకు మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరచడం జరుగుతుందన్నారు. గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతే దేశ సంపద



మాట్లాడుతున్న వీసీ తాతా నర్సింగరావు



వర్సిటీలో యువతరంగ్ ర్యాలీని చేస్తున్న విద్యార్థులు

- యువతరంగ్‌లో ఎస్వీయూ వీసీ నరసింగరావు
- వైభవంగా 'యువతరంగ్–2025' ప్రారంభం

తిరుపతి సిటీ: యువతే మన దేశానికి నిజమైన సంపదని ఎస్వీయూ వీసీ తాతా నరసింగరావు అభిప్రాయపడ్డారు. ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో శ్రీనివాస ఆడిటోరియం వేదికగా మూడు రోజుల పాటు జరగనున్న యువతరంగ్ – 2025 కార్యక్రమంలో గురువారం వీసీ పాల్గొని, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవితానికి కళలు, సాహిత్యం వంటివి అవసరమని అభిప్రాయపడ్డారు. మన సంస్కృతి సంప్రదాయాలకు కళలు ప్రతీకగా నిలుస్తాయని చెప్పారు. తనకు వ్యక్తిగతంగా కళలు, సంగీతంపై ఆసక్తి ఉన్నా, సాధన చేయడం సాధ్యం కాలేదని తెలిపారు. క్రీడా, సాంస్కృతిక రంగాల్లో యూనివర్సిటీ మంచి గుర్తింపును సంతరించుకోవడం శుభపరిణామన్నారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా సాంస్కృతిక అభివృద్ధికి అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తోందని తెలిపారు.

ర్యాలీలో అలరించిన వేషధారణ

యువతరంగ్–2025లో భాగంగా వర్సిటీలోని అన్నమయ్య భవన్ నుంచి శ్రీనివాస ఆడిటోరియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ఆకట్టుకునే వేషధారణలో ర్యాలీలో పాల్గొన్నారు. కోలాటాలతో భక్తిరస గీతాలతో ఆలపిస్తూ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఇందులో విద్యార్థులు ప్రదర్శించిన శ్రీవారి, అమ్మవారి వేషధారణలో వీక్షకులను అలరించాయి.

హల్‌చల్ చేసిన సినీనటుడు కిరణ్ అబ్బవరం

ప్రముఖ సినీ నటుడు కిరణ్ అబ్బవరం సందడి చేశారు. యువతరంగ్– 2025 ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని, హల్‌చల్ చేశారు. విద్యార్థుల కేరింతల నడుమ ఆయన మాట్లాడుతూ తాను ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో ఎంతో ఉత్తేజం పొందానని తెలిపారు. తనకు వచ్చిన గుర్తింపునకు యువత ముఖ్యకారణం అన్నారు. భవిష్యత్తులోనూ తనను ఇలాగే ఆదరిస్తారని నమ్మకం ఉందన్నారు. తొలినాళ్లలో తనకు లక్ష్యం ఏమిటో అర్థం కాలేదని తెలిపారు. పాతికేళ్ల వయసులో జీవిత లక్ష్యం అర్థమైందని, కళాకారుడిగా రాణిస్తానని నమ్మకం పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్, డీన్ ఆచార్య చెంగ్రాయుడు, ఆర్ట్స్, కామర్స్, ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు సుధారాణి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ ఆచార్య బీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో– ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ ఉదయ్, రాజశేఖర్, ప్రసన్న, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సినీ నటుడు కిరణ్ అబ్బవరం



ర్యాలీలో కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థినులు

బాలుడి ఆత్మహత్యపై విచారణ



విచారణ చేస్తున్న ఎక్సైజ్ ఉన్నతాధికారులు

చంద్రగిరి: బాలుడి ఆత్మహత్యపై గురువారం పోలీసు, ఎక్సైజ్ అధికారులు పాఠశాలలో విచారణ చేపట్టారు. మద్యం సేవించి పాఠశాలకు వచ్చిన బాలుడిని మందలించడంతోపాటు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పారిపోయిన బాలుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణాధికారులు బాలుడు పాఠశాలకు ఎన్ని గంటలకు వచ్చాడు. మద్యం సేవించి ఎందుకు వచ్చాడు. మద్యం బాటిల్ బ్యాగులో పెట్టుకుని ఎందుకు వచ్చాడన్న కోణంలో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉదయం 8.30 గంటలకు పాఠశాల వచ్చిన బాలుడు మద్యం సేవించడంతోపాటు బ్యాగులో మద్యం బాటిల్‌ను పెట్టుకుని వచ్చినట్లు గుర్తించామన్నారు. ఆపై బాలుడిని హెచ్‌ఎం వద్దకు తీసుకెళ్లామని, కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు తెలిపారు. దీంతో బాలుడు పరుగులు తీస్తూ పాఠశాలలో గోడ దూకి పారిపోయినట్లుగా అధికారులకు తెలిపారు.

మా బిడ్డను మాకు ఎందుకు అప్పగించలేకపోయారు

మద్యం సేవించి పాఠశాలకు వచ్చినట్లు పాఠశాల నుంచి హెచ్‌ఎం ఫోన్ ద్వారా సమాచారం అందించాడని బాలుడు బంధువులు తెలిపారు. తాము వస్తున్నామని చెప్పిన 10 నిమిషాలకు పాఠశాలకు చేరుకున్నట్లు తెలిపారు. అయితే అప్పటికే తమ బాలుడు పాఠశాల నుంచి పారిపోయినట్లుగా ఉపాధ్యాయులు చెప్పడం వారి విధులు నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. తమ బిడ్డకు ఎలాంటి దుర అలవాట్లు లేవని, బాలుడిపై అసత్యప్రచారం చేయడం దారుణమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలలో అయితే ఉపాధ్యాయులు ఇలాగే ప్రవర్తిసారా? అంటూ మండిపడ్డారు. తమ బిడ్డను తమకు అప్పగించలేకపోవడంలో ఉపాధ్యాయుల పనితీరుకు అద్దం పడుతోందన్నారు. బాలుడు తప్పు చేస్తే, వారికి తెలియకుండా సమాచారం ఇవ్వాలే తప్ప, ఇలా బాలుడి ముందే ఎలా ఫోన్ చేస్తారంటూ మండిపడ్డారు. కేవలం 20 మంది మాత్రమే ఉన్న విద్యార్థుల ప్రవర్తనపై ఉపాధ్యాయులు దృష్టి సారించడంలో పూర్తిగా విఫలమయ్యారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ బిడ్డ మద్యం సేవించి ఉంటే పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడవుతుందని, ఇలా ఉపాధ్యాయులు మద్యం సేవించాడని చెప్పడం దారుణమన్నారు.

బెల్టు దుకాణం ద్వారా మద్యం కొనుగోలు చేసినట్లు ఆరోపణలు

సీఎం చంద్రబాబు సొంత మండలంలో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు వెలిశాయి. 24 గంటలూ మద్యం లభిస్తుండడంతో ఇప్పటికే పేదల బతుకులు రోడ్డున పడుతున్నాయి. ఈ క్రమంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన బాలుడు బెల్టు దుకాణంలో మద్యం కొనుగోలు చేసినట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. పనపాకం నుంచి చంద్రగిరి వరకు 12 కిలోమీటర్ల దూరంలో సుమారు 15కు పైగా బెల్టు దుకాణాలను నడుపుతున్నట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. బెల్టు దుకాణాలపై చర్యలు తీసుకోకుండా, అధికారులు మామూళ్లకు అలవాటు పడి వారికి సహకరిస్తున్నారంటూ మండిపడ్డారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి బెల్టు దుకాణాలపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఓబీసీల హక్కుల సాధనే లక్ష్యం

- సౌత్ ఇండియా ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు

తిరుపతి కల్చరల్: ఓబీసీల హక్కుల సాధనే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని సౌత్ ఇండియా ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడలో ఈనెల 12వ తేదీన జరిగిన సౌత్ ఇండియా ఓబీసీ సెమినార్‌లో దక్షిణాదితోపాటు ఉత్తరాది రాష్ట్రాల ఓబీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొని, ఓబీసీ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయడంతో పాటు సౌత్ ఇండియా ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో జనగణనలో కులగణన శాస్త్రీయ పద్ధతిగా చేపట్టాలని, జనాభా ప్రాతిపదికన తమ వాటా హక్కులను తమకు కేటాయించాలన్నారు. తెలంగాణ తరహాలో 42 శాతం స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు

సూపర్ జీఎస్టీ 2.0 తగ్గింపును సద్వినియోగం చేసుకోండి



ర్యాలీని ప్రారంభిస్తున్న జేటీసీ కృష్ణవేణి, జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్

తిరుపతి మంగళం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ 2.0 తగ్గింపు ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి పిలుపునిచ్చారు. సూపర్ జీఎస్టీ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తూ తిరుపతి జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో గురువారం రవాణాశాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి, జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. జీఎస్టీ అధికారులు రాజ్యలక్ష్మి, నవీన్ కుమార్‌రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, మోహన్ కుమార్, రమణా నాయక్, ఆంజనేయ ప్రసాద్, స్వర్ణలత, పరిపాలన అధికారులు విజయ ప్రశాంతి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

2026 డిసెంబర్‌కు పనులు పూర్తి



చిల్లకూరు: బకింగ్ హాం కెనాల్‌పై నిర్మిస్తున్న వంతెన పనులు పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు



చిల్లకూరు: క్రిస్ సిటీ పనుల పురోగతి మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

- సాగరమాల రహదారి పనులు పరిశీలించిన కలెక్టర్

చిల్లకూరు: గ్రీన్‌ఫీల్డ్ రహదారుల పనులు నాలుగు ప్యాకేజీల్లో మూడు ప్యాకేజీలను 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. చిల్లకూరు మండలంలో శరవేగంగా జరుగుతున్న సాగరమాల,(గ్రీన్‌ఫీల్డ్)రహదారి పనులను ఆయన 35 కి.మీ. మేర పరిశీలించారు. అలాగే చిల్లకూరు, కోట మండలాల పరిధిలో ఏర్పాటు కానున్న క్రిస్ సిటీలో అభివృద్ధి పనులను పరిశీలించి, తీర ప్రాంతంలోనే ఏర్పాటు కానున్న సోలార్ ప్లాంట్ వివరాలను పరిశ్రమ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాగరమాల నిర్మాణ సంస్థ ప్రతినిధులు, క్రిస్ సిటీ ప్రతినిధులతో వేర్వేరు సమీక్ష నిర్వహించి, వారికి ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తరువాత కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు నాలుగు ప్యాకేజీలుగా అమలు అవుతున్నాయన్నారు. ఇందులో ఒకటి నాయుడుపేట నుంచి కృష్ణపట్నం పోర్టు వరకు, ఒకటి అంతర్గత రహదారి ప్రాజెక్టు, మరొకటి వరగలి క్రాస్ రోడ్డు నుంచి కృష్ణపట్నం వరకు, నాలుగోది నెల్లూరు జిల్లా ముత్తుకూరు నుంచి కృష్ణపట్నం వరకు మొత్తంగా 125 కి.మీ. మేర రహదారుల నిర్మాణం జరుగుతుందన్నారు. వీటిలో మూడు ప్రాజెక్టు పనులు 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. నాయుడుపేట నుంచి కృష్ణపట్నం వరకు ఉన్న రహదారి పనులు 2027 జూన్ నాటికి అందుబాటులోకి తీసుకుని వచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. సుమారు రూ.3 వేల కోట్లతో చేపడుతున్న రహదారుల నిర్మాణ పనులు పూర్తయితే, తీర ప్రాంతం సుందరంగా ఉంటుందని తెలిపారు. చిల్లకూరు, కోట మండలాల మధ్యలో ఏర్పాటు అవుతున్న క్రిస్ సిటీకి సంబంధించి తొలివిడతగా 2,500 ఎకరాల్లో ప నులు చేపడుతున్నామన్నారు. ఇందుకుగాను రూ.1200 కోట్లు వెచ్చించనుండగా ప్రస్తుతం రూ.200తో పనులు పూర్తి చేస్తున్నామన్నారు. ఆయన వెంట గూడూరు ఎఫ్‌ఏసీ ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, నేషనల్ హైవే పీడీ నెల్లూరు చౌదరి, జిల్లా మైనింగ్ అధికారి బాలాజీ నాయక్, చిల్లకూరు, కోట తహసీల్దార్లు శ్రీనివాసులు, జేజే రావు ఉన్నారు.

బైకును ఢీకొన్న టిప్పర్

- నాగలాపురం మండల సర్వేయర్ సునీత మృతి
- గ్రామ సర్వేయర్ దినేష్‌కు స్వల్పగాయాలు



సంఘటన స్థలంలో మండల సర్వేయర్ సునీత (ఇన్‌సెట్) సునీత (ఫైల్)

నాగలాపురం: ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొన్న ఘటనలో మండల సర్వేయర్ సునీత మృతి చెందగా గ్రామ సర్వేయర్ స్వల్పంగా గాయపడ్డారు. మండలంలోని బైటకొడియంబేడులో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. నాగలాపురం మండలంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న సునీత, గ్రామ సర్వేయర్ దినేష్‌తో కలిసి సురుటుపల్లిలో సర్వే పనులు పూర్తి చేసుకుని తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో బైటకొడియంబేడు హైవేపై తిరుపతి వైపు వెళుతున్న ఓ టిప్పర్ బైకును ఓవర్‌టైక్ చేసే ప్రయత్నంలో వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై వెనుక కూర్చొని ఉన్న మండల సర్వేయర్ సునీత టిప్పర్ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ నడుపుతున్న దినేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రైవేటు అంబులెన్స్‌లో మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన దినేష్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనింగ్ ఎస్ఐ ప్రసాద్, ఏఎస్ఐ షణ్ముగం తెలిపారు.